## డిప్యుటేషన్లు రద్దు చేయాలి


మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్

కామారెడ్డి, జూన్ 20 : నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొందరు ఉపాధ్యాయులు సంఘాల పేరుతోనూ, పలుకుబడిని ఉపయోగించుకొని మేడ్చల్ పరిసర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను వెంటనే నిలిపి వేయాలని కోరారు. నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూం పల్లి సంగయ్య, పులి బాల్ నర్సు, తాడ్వాయి మండల జనరల్ సెక్రటరీ ఇటికెల సత్యం, మండల అధ్యక్షుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు షిఫ్టింగ్‌కు పర్మిషన్ లేకుండా యథావిధిగా అడ్మిషన్లు కొనసాగిస్తున్నాయని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై ఎనిమిది రోజులు గడుస్తున్నా కెనడి పాఠశాల ఇంకా నిర్మాణ దశలోనే ఉందని, ఒకవైపు నిర్మాణ పనులు కొనసాగుతూనే మరో వైపు పాఠాలు బోధిస్తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ.. అర్హత లేని ఉపాధ్యాయులతో పాఠాలు బోధిస్తున్నారని అన్నారు. ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో టీజీవీపీ నాయకులు మల్లేశ్‌యాదవ్, వినోద్, విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు బెంచీల అందజేత


పాఠశాలకు బెంచీలు అందజేసిన విద్యార్థుల తల్లిదండ్రులు.


బాన్సువాడ రూరల్, జూన్ 20 : మండలంలోని బోర్లం ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి రూ.21వేల విలువైన బెంచీలను శుక్రవారం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను ప్రధానోపాధ్యాయుడు గోపి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయ్యాల సంతోష్, చైతన్య, సత్యనారాయణ, రమేశ్‌రాథోడ్, విద్యార్థుల తల్లిదండ్రులు విజయ్, భాస్కర్, విఠల్, లక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి

భిక్కనూరు, జూన్ 20 : ప్రతి విదార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. భిక్కనూరులోని బాలుర పాఠశాలలో ఎమ్మెల్యే సహకారంతో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజ గంగారెడ్డి, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కామారెడ్డి/బాన్సువాడ రూరల్/బాన్సువాడ/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/భిక్కనూరు/బిచ్కుంద, జూన్ 20 : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేశ్ చంద్ర మాదక ద్రవ్యాల అవగాహన వారోత్సవాల పోస్టర్ల శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వలలో పడొద్దని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ముందడుగు వేయాలని అన్నారు. ఈ నెల 26 వరకు మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని శ్రీరాం నారాయణ్ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల స్వామి విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీ కళాశాల సమన్వకర్త భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గంగాధర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, అధ్యాపకులు స్వరూప్, యాదాగౌడ్, రుక్మిణి, శంకర్, జలీల్, విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీలక భాగస్వామిని అవుతామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, కళాశాల మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమన్వయకర్త శంకరయ్య, అధ్యాపకులు శివకుమార్, అమరేశం, ప్రభాకర్‌రావు, అరుణ్‌కుమార్, నాగనిక, సిద్ధురాజు, రాణి, గంగారెడ్డి, చంద్రకాంత్, గోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు. లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక పోలీసులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా లింగంపేటలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మానవహారం ఏర్పాటుచేసి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వర్‌నగర్ గ్రామ శివారులో ఉన్న గురుకుల పాఠశాలలో ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. బిచ్కుందలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.


కామారెడ్డిలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ రాజేశ్ చంద్ర


బాన్సువాడలో ప్రతిజ్ఞ చేస్తున్న ఇంటర్మీడియెట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, అధ్యాపకులు, విద్యార్థులు


లింగంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు..


ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

## కేంద్రప్రభుత్వ పథకాలపై సమీక్ష

కామారెడ్డి, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ అధ్యక్షతన శుక్రవారం 'దిశ' సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంబంధిత అధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ తరపున డ్రోన్లను విరివిగా ఉపయోగిస్తూ యువతకు డ్రోన్ల నిర్వహణపై శిక్షణను ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్

## డే కేర్ సెంటర్ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జూన్ 20 : సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలో వయోవృద్ధుల కోసం ఒక మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ నిర్వహణ, సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థల వారు మూడేండ్ల అనుభవం కలిగి డే కేర్ సెంటర్స్, వృద్ధాశ్రమాలు, చిల్డ్రన్ హోం, షెల్టర్ హోమ్స్ గతంలో నిర్వహించినవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్ రూం నంబర్ 31లో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు కోసం జిల్లా వెబ్‌సైట్ https://kamareddy.telangana.gov.in/ notice_category/notification/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి, జూన్ 20 : తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో అర్హులైన అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీఈ, పీడబ్ల్యూడీ యువతీ యువకులు జనరల్, ప్రొఫెషనల్ డిగ్రీ కలిగిన వారికి ఉచిత పోటీ పరీక్షలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ (ప్రీలిమ్స్ కమ్ మెయిన్స్ 2025) 10 నెలలపాటు ఉచిత శిక్షణకు జూలై 7వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.tsstudycircle.com.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష జూలై 13వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం రూ.మూడు లక్షలలోపు ఉన్నవారు అర్హులని తెలిపారు.

## బాన్సువాడను విద్య, వైద్యంలో హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం


అధికారులతో మాట్లాడుతున్న పోచారం

బాన్సువాడ, జూన్ 20 : బాన్సువాడను విద్య, వైద్యంలో హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో దుర్కి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవన సముదాయ పనులపై సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడారు. రూ.40 కోట్లతో నిర్మిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవనం సముదాయ పనులను త్వరగా పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నర్సింగ్ కళాశాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, ఎస్ఈ, సత్యనారాయణ రెడ్డి, డీఈఈ మోహన్, కాంట్రాక్టర్ గౌరి శంకర్, సిబ్బంది అరవింద్ పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు అందజేత

బీబీపేట(దోమకొండ), జూన్ 20 : దోమకొండలోని టెలిఫోన్ బీడీ కంపెనీ మేనేజర్‌కు బీఎల్‌టీయూ నాయకులు జాతీయ సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధరాములు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాన్ని నిరసిస్తూ చేపట్టే జాతీయ సమ్మెలో టెలిఫోన్ బీడీ కార్మికులు పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, టెలిఫోన్ బీడీ సెంటర్ పాక్యర్లు జగదీశ్, టేకేదార్లు శంకర్, ప్రవీణ్, సిద్ధరాములు, నరేశ్, జానీ పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

బాన్సువాడ, జూన్ 20 : మున్నూరు కాపులు జనాభాలో అత్యధికంగా ఉన్నారని, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బీర్కూర్ మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ ప్రకాశ్, రాములు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడ, జూన్ 20 : పట్టణంలోని తాడ్కోల్ డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో కుటుంబ కలహాలతో ఇందూరు రాజు(35) శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు బాన్సువాడ పట్టణ సీఐ అశోక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఉన్న రాజు కుటుంబ సభ్యులు ఇటీవల బాన్సువాడకు వచ్చి ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబంలో కలహాల కారణంగా రాజు గురువారం అర్ధరాత్రి తన బావమరిదికి ఫోన్ చేసిచెప్పి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఘటనా స్థలాన్ని సీఐ, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతుడి చిన్నన్న ఇందూరు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దు


మాట్లాడుతున్న ఎస్సై మురళి

లింగంపేట(తాడ్వాయి), జూన్ 20: గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దని తాడ్వాయి ఎస్సై మురళి సూచించారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి లాటరీలో డబ్బులు గెలిచారని, మీపై కేసులు నమోదు అయ్యాయని డబ్బులు పంపాలని కోరుతున్నట్లు తెలిపారు. ఇలాంటి ఫోన్ వచ్చిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దొంగతనాల నివారణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరిస్తే 8712686094 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు సుప్రజ, శ్రీనివాస్‌తోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'దోస్త్' అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఎల్లారెడ్డి రూరల్/ బిచ్కుంద, జూన్ 20: డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ గడువును ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఎల్లారెడ్డి ప్రాంత విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం కొత్తగా బీఎస్సీ ఫార్మాస్యూటికల్ సైన్స్, బీకాం హెచ్‌ఆర్ ఆపరేషన్స్ కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, దోస్త్ అడ్మిషన్లపై సందేహాల నివృత్తి కోసం సెల్ నెంబర్ 9492795524లో కో-ఆర్డినేటర్ వెంకటేశంను సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST
★నేను GATLA THARUN S/o. Gatla Gangadhar, R/o.H.No.3-27, Vill: Amrad , Mdl: Makloor, Nizamabad Dist. నా యొక్క పాస్‌పోర్ట్ నెం. S1956217 గలది. తేది: 20.01.2025న అమ్రాద్ నుండి మాక్లూర్ వేళ్ళే మార్గంలో పోయింది దొరికినవారు సంప్రదించు సెల్ నెం. 9618560811
NTZ-336106

పాలసీబాండ్ పోయినది
Mr.సముద్రాల సాయిక్రిష్ణ, ఇ.నెం.1-55, వంగపాడ్, హసన్‌పర్తీ, వరంగల్, పిన్ 506006, ఎస్‌బిఐ లైఫ్ పాలసీబాండ్ పాలసీబాండ్ నెం.1K601104506 కామారెడ్డి జయశంకర్ కాలనీ నుండి కామారెడ్డి బస్టాండ్‌కు బైక్ పై వెళ్ళేమార్గంలో పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్ నెం. 63033 77379.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# భూసమస్యలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి

**బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి**

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 20: భూ సమస్యలు ఉన్న ప్రతి రైతూ తప్పనిసరిగా భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతితో అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 74, గండిమాసానిపేట్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 68 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రేమ్‌సింగ్, గిర్దావర్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులను పరిశీలిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

## పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

లింగంపేట/ నాగిరెడ్డిపేట, జూన్ 20: నాగిరెడ్డిపేట మండలంలోని వదలపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో మొదటి తరగతిలో చేరుతున్న 25 మంది విద్యార్థులతో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు హెచ్‌ఎం రాజశేఖర్ తెలిపారు. గ్రామంలోని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. దీంతో 25 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలలో చేరారన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు అమృత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. నవోదయ, పోటీ పరీక్షలకు అన్ని రకాలుగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, ప్రమీల, హరీశ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త లలిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. లింగంపేట మండలం ఐలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరే విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించినట్లు హెచ్‌ఎం దామోదర్ తెలిపారు. ముందుగా సరస్వతీ దేవికి పూజలు చేసిన అనంతరం చిన్నారులతో అక్షరాలు దిద్దించామని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలని కోరారు. విద్యార్థులకు పలకలు, పెన్సిళ్లు, నోటు బుక్కులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పద్మ, శివానంద, లావణ్య, నరేశ్, నర్సింహులు, జయశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఐలాపూర్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

## దుర్గమ్మకు బోనాల సమర్పణ

నాగిరెడ్డిపేట, జూన్ 20: మండలంలోని చీనూర్ గ్రామంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలను డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి దుర్గమ్మకు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు హన్మంత్‌రెడ్డి, యాదగిరి, బాలయ్య, హన్మాండ్లు, మురళీగౌడ్, దుర్గాగౌడ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చీనూర్‌లో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

## మద్నూర్‌లో యోగా డే ర్యాలీ

మద్నూర్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలకేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మనసుని నియంత్రించేది యోగా అని, శరీర సౌష్టవానికి యోగా చాలా అవసరమని ఉపాధ్యాయులు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

## మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

లింగంపేట/ బీబీపేట్, జూన్ 20: గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని లింగంపేట ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలు వృద్ధిచెందే అవకాశం ఉన్నందున దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వదలాలని కార్యదర్శులకు సూచించారు. బీబీపేట్, యాడారం, మల్కాపూర్, జనగామ తదితర గ్రామాల్లో ఫ్రైడే.. డ్రైడే నిర్వహించారు. బీబీపేటలో ఎంపీవో అబ్బాగౌడ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట, జూన్ 20: మండల కేంద్రానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. పద్నాలుగు సంవత్సరాల బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా.. గోపాల్‌పేటకు చెందిన బుడగ జంగం ఆల్ఫా బాలికను ఇంట్లోకి తీసుకువెళ్లి అసభ్య కరంగా ప్రవర్తించాడని చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు బాలికలను సఖీ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

## స్కూల్ బస్సు, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

నాగిరెడ్డిపేట, జూన్ 20: మండల కేంద్రంలోని నల్లపోచమ్మ ఆలయం వద్ద ప్రైవేటు పాఠశాల బస్సు ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనగా ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. గోపాలపేటలోని కేరళ పాఠశాలకు చెందిన బస్సు శుక్రవారం విద్యార్థులను తీసుకొని వెళ్తున్నది. జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన దేవీసింగ్ బైకును మూలమలుపు వద్ద ఢీకొని సుమారు 30ఫీట్ల దూరం నెట్టుకొని వెళ్లింది. తీవ్రంగా గాయపడిన బస్సు కింద ఉన్న దేవీసింగ్‌ను స్థానికులు సమీపంలో ఉన్న ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనం, స్కూల్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

## పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

పెద్ద కొడప్‌గల్, జూన్ 20:మండలంలోని విఠల్‌వాడి తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం మండల నాయకులు భూమిపూజ చేశారు. పంచాయతీ భవనం నిర్మాణం కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.20లక్షలు, సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.10లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, మోహన్, మష్ణు పటేల్, జాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బిచ్కుంద, జూన్ 20: బిచ్కుందలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నేడు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## ప్రతి ఇంటికీ వెళ్లి వివరాలు సేకరించాలి


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీవో మల్హారి

లింగంపేట, జూన్ 20: గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించాలని మండల పంచాయతీ అధికారి మల్హారి వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని భవానీపేట గ్రామ సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న వారికి నిత్యం మందులు అందజేయాలని ఆదేశించారు. సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేయాలని, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వాటికి మరమ్మతు చేయించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి, వైద్య సిబ్బంది లక్ష్మణ్, అంజలీదేవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ నిర్మాణం ఆపాలని వ్యాపారుల నిరసన

బిచ్కుంద, జూన్ 20: బిచ్కుంద బస్టాండ్ చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీని ఆపాలని కోరుతూ వ్యాపారులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారులు గుంతలు తీయించారు. బస్టాండ్ ప్రధాన రహదారికి అడ్డంగా ప్రహరీ నిర్మిస్తే, దుకాణాల ముందు నుంచి ప్రజలు వెళ్లడం తగ్గుతుందని, దీంతో తమ వ్యాపారాలు దెబ్బ తింటాయని వ్యాపారులు వాపోయారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు.